సాక్షి గుంటూరు

శనివారం । 22 । ఏప్రిల్ । 2023



త్రికోటేశ్వరా...


నరసరావుపేట రూరల్: త్రికోటేశ్వర స్వామిని రాష్ట్ర స్త్రీ,శిశు సంక్షేమ శాఖా మంత్రి కె.వి.ఉషా శ్రీచరణ్ శుక్రవారం దర్శించుకున్నారు. మంత్రికి అధికారులు స్వాగతం పలికారు.



నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో శుక్రవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.3,500, గరిష్ట ధర రూ.5,800, మోడల్ ధర రూ.4500 వరకు పలికింది.

జీరో కరోనా



గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా శుక్రవారం కరోనా పాజిటివ్ కేసులు ఒక్కటీ నమోదు కాలేదు. అలాగే ఎక్కడా కరోనా మరణాలు సంభవించ లేదు.

న్యూస్‌రీల్

రైతుభరోసాకు దరఖాస్తు చేసుకోండి

ప్రత్తిపాడు: రైతు భరోసా పథకానికి అర్హత ఉన్న రైతులు ఈ నెల 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని గుంటూరు ఏడీఏ జి. శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం మరోసారి రైతుభరోసా పోర్టల్‌ను ఓపెన్ చేయడం జరిగిందని, ఇప్పటివరకు రైతుభరోసా పథకం ద్వారా లబ్ధిపొందని కర్షకులు, అర్హత ఉన్న వారు ఎవ్వరైనా ఉంటే దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విజయకీలాద్రిపై తిరునక్షత్ర ఉత్సవాలు



తాడేపల్లిరూరల్: సీతానగరంలోని విజయకీలాద్రి పర్వతంపై శుక్రవారం నుంచి మంగళవారం వరకు తిరునక్షత్ర ఉత్సవములు నిర్వహిస్తున్నట్లు జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ మేనేజర్ పురాణం వెంకటాచార్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి మంగళ శాసనాలతో శుక్రవారం ఉదయం రామానుజుల వారికి తిరుమంజన సేవ నిర్వహించామన్నారు. అలాగే అలంకరణ, మల్లెపూలతో సహస్రనామార్చన కార్యక్రమాలు అంగరంగ వైభవంగా నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం తీర్థప్రసాద గోష్ఠితో కార్యక్రమం ముగిసిందని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జీయర్ పాఠశాల వేద విద్యార్థులు, విజయకీలాద్రి అర్చకులు పాల్గొన్నారు.

25న ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్‌లో జాబ్‌మేళా

గుంటూరు ఎడ్యుకేషన్: గుజ్జనగుండ్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్‌లో ఈనెల 25న హైదరాబాద్‌కు చెందిన ఇన్ఫోసోర్స్ సంస్థ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.ప్రభాకరరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మిషన్ ఆపరేటర్స్, టెక్నీషియన్స్ పోస్టులకు 18 ఏళ్లు నిండి టెన్త్, ఐటీఐ, డిప్లొమా (ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్, ఎలక్ట్రికల్, మెకానికల్) అర్హతలు గల అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు హైదరాబాద్‌లో అర్హతను బట్టి రూ.10 వేల నుంచి రూ.15వేల వరకు వేతనం ఉంటుందని, అనుభవం గల అభ్యర్థులకు ఎక్కువ వేతనం ఉంటుందని పేర్కొన్నారు. అభ్యర్థులు తమ విద్యార్హతలు, పుట్టిన తేదీ ధృవీకరణ పత్రం, ఆధార్‌కార్డు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలతో ఈనెల 25వ తేదీ ఉదయం 11 గంటలకు హాజరు కావాలని సూచించారు. ఇతర వివరాలకు ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ అధికారి ప్రభావతిని 70137 17319 నంబర్లో సంప్రదించాలని తెలిపారు.

తల్లి ఒడికి పసికందు



ప్రత్తిపాడు: మద్యం మత్తులో మందుకు డబ్బులు లేక ఏడాదిన్నర పసికందును తల్లికి తెలియకుండా అమ్మేసిన తండ్రి ఉదంతమిది. పోలీసుల చొరవతో 48 గంటలు గడవక ముందే పసికందు మళ్లీ తల్లి ఒడి చేరడంతో కథ సుఖాంతమైంది. కోయవారిపాలెంలో నివాసం ఉంటున్న వసంతరావు జాలరి. అతను చేపల కుంటలు చూసేందుకు రెండురోజుల క్రితం అద్దంకి వెళ్లాడు. పూర్తిగా మద్యం మత్తులో ఉన్న వసంతరావు అక్కడ స్నేహితుడు వీరాంజనేయులుకు తన ఏడాదిన్నర బిడ్డ ఏసురాజును అమ్మేశాడు. ఈ విషయం భార్య కొండమ్మకు చెప్పలేదు. ఈ నేపథ్యంలో బిడ్డ కనిపించడం లేదని వసంతరావు భార్య కొండమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఎస్ఐ రవీంద్రబాబు 48 గంటలు కూడా గడవకముందే కేసును ఛేదించారు. వసంతరావు స్నేహితుడిని వీరాంజనేయులును తమదైన శైలిలో విచారణ చేయడంతో అతను పసికందును తీసుకొచ్చి పోలీసులకు అప్పగించాడు. దీంతో పోలీసులు పసికందును తల్లి చెంతకు చేర్చారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 523.70 అడుగుల వద్ద ఉంది. ఇది 156.1096 టీఎంసీలకు సమానంగా ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడికాలువకి 5,088, ఎడమకాలువకు నీటిని నిలుపుదల చేశారు. ఎస్ఎల్‌బీసీకి 1,800 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

ప్రేమకు ప్రతీక ఈద్-ఉల్-ఫితర్

- రంజాన్ పర్వదినం నేడు
- ఈద్‌కు అంతా సిద్ధం




నగరంపాలెంలోని ఈద్గా వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ ఆరిఫ్ హాఫిజ్

లక్ష్మీపురం (గుంటూరు పశ్చిమ): నెలవంక దర్శనంతో ఈద్ సంబరాలు ఆరంభమయ్యాయి. శనివారం ఈద్-ఉల్-ఫితర్ జరుపుకునేందుకు ముస్లింలు సమాయత్తమవుతున్నారు. ఈద్గాలు ముస్తాబవుతున్నాయి. శుక్రవారం రాత్రి ఈద్ సామాన్ల కొనుగోలుకు వచ్చిన ముస్లింతో వీధులు కిటకిటలాడాయి. నిజానికి పండుగలు జాతీయతకు, సంస్కృతి, వికాసానికి తోడ్పడతాయి. మానవాళికి మంచిని బోధిస్తాయి. ముస్లింలు అతి పవిత్రంగా జరుపుకునే రంజాన్ కూడా అలాంటిదే. ఈనెలలో సూర్యాస్తమయ వేళ ఆకాశంలో చంద్రుడు కనిపిస్తే మరునాడు షవ్వాల్ నెల మొదటి రోజున ఈద్-ఉల్-ఫితర్‌ను జరుపుకుంటారు.

ప్రధానంగా రంజాన్ మాసం మార్చి 24న శుక్రవారం రావడం ముగింపు కూడా ఈనెల 21వ తేదీన శుక్రవారం రావడం పట్ల ముస్లింలు చాలా అదృష్టంగా భావిస్తున్నారు. ఈ పండుగను పేద, ధనిక తేడా లేకుండా ముస్లింలు అందరూ జరుపుకోవాలని ఇస్లాం సూచిస్తుంది. అందుకే ఉన్నవారు లేని వారికి ఫిత్రా రూపంలో దానం చేయాలని ఇస్లాం సూచిస్తుంది. ఈద్ నమాజ్‌కు వెళ్లే ముందు తప్పనిసరిగా ఫిత్రా దానం చేయాలి. అప్పుడే ఈద్ నమాజు దైవామోదం పొందుతుంది. అందుకే ఈ పండుగను ఈద్-ఉల్-ఫితర్ అని పిలుస్తారు. కుటుంబంలో ఎందరు సభ్యులు ఉంటే అంత మంది తరపున పేదలకు విధిగా దానం చేయవల్సిందే. ఎలాంటి ఆటంకం లేకుండా 30 రోజుల పాటు ఉపవాస దీక్షలు పూర్తి చేసినందున అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ కూడా ఫిత్రా దానం చేయాలి. దీంతో ఉపవాస సమయంలో వచ్చిన చెడు తలంపుల నుంచి కూడా మోక్షం లభిస్తుంది.

ఈద్ రోజున రెండు రకాల వాజిబ్ (తప్పనిసరి) నమాజ్ చేయాల్సి ఉంటుంది. సూర్యోదయానికి ముందు మనం నివాసమున్న చోట ఉండే మసీదులో విధిగా ఫజర్ నమాజు చేయాలి. ఇంటికి తిరిగి వచ్చి షీర్ ఖుర్మా సేవించి ఈద్గాకు బయలుదేరాలి. నూతన వస్త్రాలు ధరించడం, కంటికి సూర్మా పెట్టుకోవడం, సుగంధ ద్రవ్యాలు పూసుకోవడం సున్నత్ (విధిగా) భావిస్తారు. ఈద్గాకు ఒక దారి నుంచి వెళ్లి మరో దారి నుంచి రావాలి. ఇమామ్ ప్రసంగం తర్వాత రెండు రకాల నమాజ్ ముగించుకొని ఇమామ్ చదివే ఖుద్బాను తప్పనిసరిగా వినాలి. దుఆ (వేడుకోలు) ముగిశాక ఒకరికొకరు ఈద్ ముబారక్ చెప్పుకోవాలి. దీంతో మనుషుల మధ్య ప్రేమలు, ఆప్యాయతలు పెరుగుతాయని, అసూయ, ద్వేషాలు సమసిపోతాయని భావిస్తారు. ఇస్లాంలో సంపన్నులైనా పేదలైనా తమకున్నంతలో తమ తాహతుకు తగినట్టుగా ఈద్‌ను జరుపుకోవడం పరిపాటి. ఎందుకంటే రంజాన్ నెల మిగతా 11 నెలల మన జీవితానికి మార్గదర్శకంగా ఉంటుంది. ఆధ్యాత్మిక చింతనను పెంపొందిస్తుంది. మానవులంతా ఒకే సమాజంగా జీవించేందుకు దారి చూపుతుంది.



కోబాల్ట్ పేటలో విద్యుత్ కాంతులీనుతున్న మసీదు

మసీదుల్లో ప్రార్థనలకు ఏర్పాట్లు

పాత గుంటూరు: పండుగ ప్రార్థనల కోసం నగర వ్యాప్తంగా ఈద్గాలు, మసీదులు ముస్తాబయ్యాయి. ముస్లిం కళాశాల ప్రాంగణంలోని ఈద్గాలో ఉదయం 10 గంటలకు, పాత బస్టాండ్ ఉర్దూ పాఠశాల ప్రాంగణంలో ఉదయం 9 గంటలకు, నగరంపాలెంలోని ఈద్గాలో ఉదయం 9.30 గంటలకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించేందుకు ఏర్పాట్లు జరిగాయి. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఈద్గాల వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లను చేయాలని జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హాఫీజ్ ఆదేశించారు. శుక్రవారం గుంటూరు నగరంలోని ఆంధ్ర ముస్లిం కళాశాల ఆవరణలో, పాతబస్టాండ్ దగ్గర్లోని ప్రభుత్వ ఉర్దూ పాఠశాల, ఎంటీబీ సెంటర్ (ఉల్ఫాహాల్) వద్ద ఉన్న ఈద్గాల వద్ద భద్రతా ఏర్పాట్లను ఎస్పీ పర్యవేక్షించారు.

రంజాన్ కొనుగోళ్ల సందడి

రంజాన్ పండుగ పురస్కరించుకుని నూతన వస్త్రాలు, కావల్సిన సామగ్రి కొనుగోళ్లతో మార్కెట్లు కళకళలాడాయి. పట్నంబజార్, పాత బస్టాండ్, లక్ష్మీపురం, బ్రాడీపేట, కొరిటెపాడు, కొత్తపేట తదితర ప్రాంతాల్లోని దుకాణాల్లో వస్త్రాలు, డ్రైఫ్రూట్స్, సుర్మా, అత్తర్, సేమియా వంటి వస్తు కొనుగోలుతో నగరంలో రంజాన్ శోభ సంతరించుకుంది.



మళ్లీ 'కానుక' నాటకం

పేరు.. చంద్రన్న పెళ్లి కానుకట!!

- పశ్చిమలో ఉయ్యూరు శ్రీనివాస్ ఫ్లెక్సీల హడావుడి
- వధువు పశ్చిమ వాసై ఉండాలట
- కానుక ఎంతిస్తారో చెప్పరు
- గతంలోనూ ఇదే తరహా మోసం
- నాడు అన్నగారి జనతా వస్త్రాలు, చంద్రన్న సంక్రాంతి కానుక అంటూ హడావుడి
- తొక్కిసలాట జరిగి ముగ్గురి మృతి
- ఇప్పటికీ నష్టపరిహారం అందలేదు!

సాక్షి ప్రతినిధి, గుంటూరు: ఈ ఏడాది జనవరి ఒకటిన ఉయ్యూరు ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నగారి జనతా వస్త్రాలు-చంద్రన్న సంక్రాంతి కానుకల పంపిణీ పేరుతో ముగ్గురి ప్రాణాలు పోవడానికి కారణమైన ఉయ్యూరు శ్రీనివాస్ మరో నాటకానికి తెరతీశారు. ఇప్పుడు చంద్రన్న పెళ్లి కానుక పేరుతో పశ్చిమ నియోజకవర్గంలో ఫ్లెక్సీలతో హడావిడి చేస్తున్నారు. తెలుగుదేశం పార్టీ తరపున పశ్చిమ నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని చూస్తున్న శ్రీనివాస్ పేద ప్రజలను మభ్య పెట్టే కార్యక్రమాలు చేస్తున్నారు. ఈ ఏడాది జనవరి ఒకటో తేదీన చంద్రన్న సంక్రాంతి కానుక, అన్న గారి జనతా వస్త్రాల పేరుతో ఉయ్యూరు ఫౌండేషన్ పేరుతో గుంటూరులో భారీ సభ ఏర్పాటు చేసి చంద్రబాబు నాయుడిని ముఖ్య అతిథిగా పిలిచిన సంగతి తెలిసిందే.

ఈసభలో ఒక్కొక్కరికీ మూడు వేల రూపాయల విలువైన కానుకలు ఇస్తామని ఇంటింటికీ తిరిగి జనసమీకరణ చేసి చివరికి మూడు వందలు కూడా చేయని కానుకలు ఇచ్చారు. అవి కూడా 30 వేల మందికి ఇస్తున్నట్లు చెప్పి మూడు వేల మందికి కూడా ఇవ్వలేదు. చంద్రబాబు మీటింగ్‌కు ముందే చీరలు పంపిణీ చేస్తే సభకు జనాలు ఉండరని వారికి సభ అయ్యే వరకూ పంపిణీ చేయకుండా ఆపారు. ఒక్కసారిగా జనాలు కానుకల కోసం ఎగబడటంతో తొక్కిసలాట జరిగి ముగ్గురు మహిళలు మత్యువాత పడగా, పదుల సంఖ్యలో మహిళలు గాయపడ్డారు. తొక్కిసలాట జరిగిన వెంటనే ఉయ్యూరు ఫౌండేషన్ నుంచి మరణించిన వారికి ఒక్కొక్కరికీ రూ. 20 లక్షల రూపాయలు నష్టపరిహారం ఇస్తానంటూ ప్రకటించారు. గాయపడిన వారికి అయ్యే ఆసుపత్రి ఖర్చులన్నీ భరిస్తానని హామీ ఇచ్చి మళ్లీ అడ్రస్ లేకుండా పోయారు. మళ్లీ ఇప్పుడు తాజాగా చంద్రన్న పెళ్లి కానుక పేరుతో ఫ్లెక్సీలు వేశారు. ఇందులో ఎన్‌టీఆర్, చంద్రబాబు, లోకేష్ ఫోటోలు తప్ప స్థానిక నేతల ఫోటోలు వేయలేదు. పశ్చిమ నియోజకవర్గం వారికే ఈ ఆఫర్ అంటూ ప్రచారం చేసుకుంటున్నారు. దీనికి పలు షరతులు పెట్టారు. వివరాలన్నీ వెబ్‌సైట్‌లో పొందుపరిస్తే ఇంటికి వెళ్లి అర్హతలు పరిశీలించి వధువు బ్యాంక్ ఖాతాకు 20 శాతం, పెళ్లిరోజున 80 శాతం నగదు జమ చేస్తామని ప్రచారం చేస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, పేద ప్రజలకు ఇస్తామని చెబుతున్నా అసలు ఎంత ఇస్తారనే విషయాన్ని మాత్రం చెప్పడం లేదు. రూ. 25 వేల వరకూ ఇస్తారని తెలుగుదేశం నేతలు చెబుతున్నారు. దీనికి పెట్టిన షరతులు చూస్తే ఎవరికి ఈ కానుక అందదని కేవలం మళ్లీ నియోజకవర్గంలో తన ఉనికిని చాటుకునేందుకే ఈ తరహా ప్రచారానికి ఉయ్యూరు శ్రీనివాస్ దిగారని తెలుగుతమ్ముళ్లు చెబుతున్నారు. తమకు కనీసం తెలియకుండా ఉయ్యూరు ఫౌండేషన్ పేరుతో చేస్తున్న ఈ కార్యక్రమం ప్రజల్ని మరోసారి మోసం చేయడమేనని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో అతను చేపట్టిన కార్యక్రమం వల్ల ప్రజల్లో తమకు మైలేజీ రాకపోగా నష్టపోయామని నియోజకవర్గ నేతలు అంటున్నారు. బాధితులను ఇంతవరకూ ఆదుకోకుండా కొత్త కార్యక్రమం అంటూ హడావిడి చేయడంపై తెలుగు తమ్ముళ్లు నిరసన వ్యక్తం చేస్తున్నారు.



నగరంలో చంద్రన్న పెళ్లి కానుక పేరుతో వెలసిన ఫ్లెక్సీలు



ఇఫ్తార్ విందు

చిలకలూరిపేట పట్టణంలోని అబ్బాస్‌నగర్‌లో రంజాన్ పర్వదినం సందర్భంగా శుక్రవారం సాయంత్రం భారీగా ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా మంత్రి విడదల రజిని పాల్గొన్నారు. ముందుగా ముఫ్తీ అనస్‌ఖాన్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థన నిర్వహించారు. అనంతరం రంజాన్ పర్వదిన ప్రాశస్త్యాన్ని మంత్రి వివరించారు. ఎంతో నియమనిష్ఠలతో ఉపవాసాలు ఆచరించడం శుభదాయకమన్నారు. అనంతరం స్వయంగా సోదరులకు పదార్థాలను మంత్రి వడ్డన చేశారు.

–చిలకలూరిపేట

వడ్డెర సత్తెన్న విగ్రహావిష్కరణ చారిత్రాత్మకం

పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి కారుమూరి, మంత్రి అంబటి, ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్సీలు

సత్తెనపల్లి: సత్తెనపల్లిలో పల్లపు సత్తెన్న విగ్రహావిష్కరణ సత్తెనపల్లి నియోజకవర్గంలో చారిత్రాత్మకమని, రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి, పల్నాడు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరావు అన్నారు. ఈ సామాజిక వర్గాన్ని సంఘటితం చేసి ఇంతటి మంచి కార్యక్రమం నిర్వహించిన మంత్రి అంబటి రాంబాబు కృషి అభినందనీయమన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో శుక్రవారం రాత్రి సత్తెనపల్లి గడ్డ ఎత్తిన పల్లపు సత్తెన్న విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజర య్యారు. ఈ సందర్భంగా కారుమూరి మాట్లాడుతూ బీసీలలో చిట్ట చివరి సామాజిక వర్గానికి కూడా సామాజిక సమానత్వం అందించిన ఘనత యువ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికే దక్కిందన్నారు. 40 ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకుంటున్న చంద్రబాబు వడ్డెర్లకు చట్టసభలలో అవకాశం కల్పించారా అని ప్రశ్నించారు. రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ సత్తెన్న విగ్రహావిష్కరణతో జన్మ ధన్యమైందని, నా హయాంలో సత్తెనపల్లి నియోజకవర్గంలో వడ్డెర సత్తెన్న విగ్రహావిష్కరణ చేసుకోవడం భవిష్యత్ తరాలకు చరిత్రను అందించటమేనన్నారు. నరసరావుపేట పార్లమెంటు సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ గతంలో లాగా బీసీలు బ్యాక్ వార్డ్ క్లాస్సెస్ కాదని జగనన్న పరి పాలనలో బ్యాక్ బోన్ మీరేనని పేర్కొన్నారు.

సన్మాన గ్రహీత చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ 75 సంవత్సరాల స్వాతంత్ర చరిత్రలో వడ్డెర సామాజిక వర్గం చట్టసభల్లో అడుగుపెట్టడం ఇదే తొలిసారి అని, ఇది చారిత్రాత్మకమని, ముఖ్యమంత్రి జగన్ వల్లే సాధ్యమైందన్నారు. ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ మాట్లాడుతూ రాజ్యాధికారానికి దూరంగా ఉన్న అట్టడుగు వర్గాలను గుర్తించి, వారికి అవకాశం ఇస్తూ ప్రోత్సహిస్తున్న జగన్‌కు అందరు అండగా ఉండాలన్నారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ ఏసురత్నాన్ని స్ఫూర్తిగా తీసుకొని వడ్డెర్లు ఉన్నత స్థితికి చేరుకోవాలన్నారు.

గుంటూరు నగర మాజీ డిప్యూటీ మేయర్ తాడిశెట్టి మురళీమోహన్, వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయల నారాయణ, వడ్డెర కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ దేవళ్ళ రేవతి, విజయవాడ దుర్గ ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు, డాక్టర్ గీతా హసంతి, పెండెం బాబూరావు, బాసు లింగారెడ్డి, బత్తుల సాంబశివరావు, తన్నీరు శ్రీనివాసరావు, కందుల నాగేశ్వరరావులు మాట్లాడారు. ఈ కార్యక్రమానికి పట్టణ వడ్డెర సంఘం అధ్యక్షులు వేముల వరప్రసాద్ అధ్యక్షత వహించగా నియోజవర్గ అధ్యక్షులు తన్నీరు శ్రీనివాసరావు ఆహ్వానం పలికారు. ముందుగా అతిథులకు భారీ ర్యాలీతో విగ్రహం వద్దకు తీసుకొచ్చి సత్తెన్న విగ్రహాన్ని ఆవిష్కరించారు. అంబటి ఆధ్వర్యంలో చంద్రగిరి యేసు రత్నమును అతిథులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు చల్లంచర్ల సాంబశివరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెండెం బాబురావు, సత్తెన్న విగ్రహ దాత బత్తుల రామస్వామి, కర్నాటి రాంబాబు, చల్లా శ్రీనివాసరావు , పల్నాడు జిల్లా వైద్యుల విభాగం అధ్యక్షులు గజ్జల నాగభూషణ్ రెడ్డి ,జిల్లా మహిళా నాయకురాలు డా.గీతాహసంతి, వాణిజ్య విభాగం అధ్యక్షులు కౌన్సిలర్ అచ్యుత శివప్రసాద్, బీసీ సంఘం నాయకులు కార్యకర్తలు భారీ సంఖ్యలో వడ్డెర్లు పాల్గొన్నారు.

ఆరంభ దశ కీలకం

- అప్పుడే అన్నవాహిక క్యాన్సర్ నివారణ
- తరచూ త్రేన్పులు, ఛాతిలో మంట ఉంటే వ్యాధికి సంకేతం
- అన్నవాహిక క్యాన్సర్ అవగాహన మాసంగా ఏప్రిల్
- గుంటూరు జీజీహెచ్‌లో ఉచితంగా కార్పొరేట్ వైద్యం



గుంటూరు మెడికల్: గుంటూరు బ్రాడీపేటకు చెందిన సుధీర్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా జీవనం సాగిస్తున్నాడు. నిర్ణీత వేళల్లో భోజనం చేయకుండా తరచుగా రెస్టారెంట్స్‌లో ఫాస్ట్‌పుడ్స్ తింటూ అన్నం జీర్ణం కాకపోవటం, తరచుగా పుల్లటి త్రేపులు, ఛాతిలో మంట సమస్యలతో గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులను సంప్రదించాడు. వైద్యులు పరీక్షలు చేసి అతడికి అన్నవాహిక క్యాన్సర్ సోకినట్లు నిర్ధారించటంతో భయాందోళనలకు గురయ్యాడు'. ఇలా ఎంతో మంది ఆధునిక జీవనశైలి వల్ల అన్నవాహిక క్యాన్సర్ వ్యాధుల బారిన పడుతున్నారని జీర్ణకోశవ్యాధి వైద్యనిపుణులు తెలియజేస్తున్నారు. అన్నవాహిక క్యాన్సర్‌పై అవగాహన కల్గి ఉండే వ్యాధిబారిన పడకుండా ముందస్తు జాగ్రత్తపడొచ్చు. ఏప్రిల్ నెలను అన్నవాహిక క్యాన్సర్ అవగాహన మాసంగా నిర్ణయించి వ్యాధిపై అవగాహన కల్పిస్తున్నారు.

లక్షణాలు...

అన్నవాహిక క్యాన్సర్ సోకిన వారికి ఆహారం మింగడంలో ఇబ్బంది ఉంటుంది. ఆకలి సరిగా ఉండదు. ఆహారం మింగే సమయంలో గొంతులో, ఛాతిలో నొప్పి వస్తుంది. తిన్న ఆహారం జీర్ణం కాకపోవటం తద్వారా గుండెలో మంట, అలసట, ఆయాసం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

కారణాలు....

ధూమపానం, మద్యపానం చేసే వారికి ఎక్కువగా అన్నవాహిక క్యాన్సర్ సోకుతుంది. కట్టెపొయ్యలపై, ఐరన్ గ్రిల్స్‌పై కాల్చిన ఆహారం తినటం వల్ల, ఫాస్ట్ పుడ్స్ ఎక్కువగా తినటం వల్ల, అన్నవాహిక పొరల్లో వాపు వల్ల క్యాన్సర్ సోకుతుంది.

జిల్లాలో బాధితులు...

గుంటూరు జీజీహెచ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్య విభాగంలో ప్రతి నెలా 600 మందికిపైగా వివిధ రకాల సమస్యలో చికిత్స కోసంవస్తున్నారు. వీరిలో కొత్తగా 25 మంది వరకు అన్నవాహిక క్యాన్సర్ బాధితులు ఉంటున్నారని గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులు తెలిపారు.

జీజీహెచ్‌లో ఉచిత వైద్యం

గుంటూరు జీజీహెచ్‌లో అన్నవాహిక క్యాన్సర్ బాధితులకు గ్యాస్ట్రోఎంట్రాలజీ వైద్య విభాగం, నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో కార్పొరేట్ ఆస్పత్రుల కంటే మెరుగైన వైద్య సేవలు ఉచితంగా అందిస్తున్నారు. క్యాన్సర్ బాధితులకు సర్జికల్, మెడికల్, రేడియోథెరపీ, కీమోథెరపీ వైద్యసేవలు లభిస్తున్నాయి. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నాన్ కమ్యూనికబుల్ డీసీజెస్ కార్యక్రమంలో భాగంగా ప్రతిరోజూ వైద్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి పలు రకాల క్యాన్సర్‌లు ప్రాథమిక దశలోనే గుర్తించేందుకు స్క్రీనింగ్ పరీక్షలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి



తరచుగా త్రేపులు, ఛాతిలో మంట వచ్చే వారు ఏ మాత్రం ఆలస్యం చేయకుండా గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులను సంప్రదించాలి. క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షల్లో భాగంగా ప్రాథమిక దశలోనే గుర్తించేందుకు జెనెటిక్ టెస్ట్, ఎండోస్కోపీ పరీక్షలు చేయించుకోవాలి. ప్రాథమిక దశలోనే గుర్తిస్తే పూర్తిగా నయం చేయవచ్చు. నిర్ణీత వేళల్లో ఆహారం తీసుకోవాలి.

– డాక్టర్ షేక్ నాగూర్‌బాషా, గ్యాస్ట్రోఎంట్రాలజిస్ట్, గుంటూరు.

28న జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

శాఖల వారీగా సమగ్ర వివరాలతో రావల్సిందిగా అధికారులకు సూచన

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రజా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు ఈనెల 28న భేటీ కానున్నాయి. ఈ మేరకు జెడ్పీ సీఈవో జె.మోహన్‌రావు శుక్రవారం షెడ్యూల్ విడుదల చేశారు. స్థాయీ సంఘ సమావేశాలకు హాజరు కానున్న అధికారులు ఆయా శాఖల వారీగా ప్రగతి వివరాలతో పాటు గత సమావేశాల్లో చర్చించిన అంశాలపై తీసుకున్న చర్యలతో కూడిన సమగ్ర వివరాలతో హాజరు కావాల్సిందిగా సమాచారాన్ని పంపించారు. మొత్తం ఏడు స్థాయీ సంఘాలకు గాను 1,2,4,7వ స్థాయీ సంఘ సమావేశాలు జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అధ్యక్షతన జరగనున్నాయి. వీటిలో ప్రణాళిక-ఆర్థిక, గ్రామీణాభివృద్ధి, విద్య, వైద్యంతో పాటు అభివృద్ధి పనులకు సంబంధించిన అంశాలు ఉన్నాయి. అదే విధంగా 3వ స్థాయీ సంఘానికి సంబంధించిన సమావేశం వ్యవసాయంపై జెడ్పీ వైస్ చైర్మన్ శొంటిరెడ్డి నర్సిరెడ్డి అధ్యక్షతన జరగనుంది. స్త్రీ-శిశు సంక్షేమంపై తెనాలి జెడ్పీటీసీ పిల్లి ఉమా ప్రణతి అధ్యక్షతన 5వ స్థాయీ సంఘం, సాంఘిక సంక్షేమంపై జెడ్పీ చైర్‌పర్సన్ బత్తుల అనురాధ అధ్యక్షతన 6వ స్థాయీ సంఘ సమావేశం జరగనుంది. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలకు చెందిన స్థాయీ సంఘాల్లో సభ్యులుగా ఉన్న జెడ్పీటీసీలతో పాటు ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొననున్నారు.

ఐలవరం విద్యార్థుల ప్రతిభ

- ఐదేళ్లుగా కొనసాగుతున్న వినూత్న కార్యక్రమాలు
- థాయ్‌లాండ్‌లోని ఉన్నతాధికారులతో భేటీ

ఐలవరం(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం ఐలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐదేళ్లుగా విద్యార్థుల సృజనాత్మకతకు, భావ ప్రకటనా ప్రతిభకు ఆంగ్ల భాషా ప్రావీణ్యానికి పదును పెట్టేలా వినూత్న కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలో ఏ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో అవలంభించని విధంగా వివిధ దేశాల్లో వర్చువల్‌గా, ఉత్తర ప్రత్యుత్తర (పెన్‌పాల్) విధానం ద్వారా తమ ప్రతిభను చాటుకుంటున్నారు. ఇప్పటికే వర్చువల్‌గా 90 దేశాలు, పెన్‌పాల్ విధానం ద్వారా 19 దేశాల విద్యార్థులతో ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. శుక్రవారం థాయ్‌లాండ్‌లోని ఉన్నతాధికారులతో వర్చువల్‌గా హాజరయ్యారు.

క్లుప్తంగా

రాష్ట్ర స్థాయిలో పవర్ లిఫ్టింగ్ పోటీలకు జట్టు ఎంపిక

సత్తెనపల్లి: రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చూపి పల్నాడు జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ పల్నాడు జిల్లా సెక్రటరీ పసుపులేటి సురేష్ ఆకాంక్షించారు. పట్టణంలోని పవర్ హౌస్ ఫిట్నెస్‌లో రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు పల్నాడు జిల్లా నుంచి శుక్రవారం ఎంపికలు నిర్వహించారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 22 నుంచి 24వ తేదీ వరకు విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్య వహించనున్నట్లు పేర్కొన్నారు. సబ్ జూనియర్, జూనియర్, మాస్టర్స్ మెన్ అండ్ ఉమెన్ ఎక్విప్డ్ జరుగుతాయన్నారు. సబ్ జూనియర్స్‌లో 53 కేజీల్లో కె.కార్తీక్(గురజాల), 66 కేజీల్లో షేక్ కరీం(సత్తెనపల్లి), జూనియర్ విభాగంలో 52 కేజీల్లో ఎం.అనూష (కారెంపూడి), 53 కేజీల్లో షేక్ గౌస్(సత్తెనపల్లి), 59 కేజీల్లో ఫ్రాన్సిస్(సత్తెనపల్లి), 59 కేజీల్లో సౌరబ్(సత్తెనపల్లి), 66 కేజీల్లో ఎస్.శరత్(వెన్నాదేవి), 74 కేజీల్లో పి.వంశీకృష్ణ(సత్తెనపల్లి), 74 కేజీల్లో ఎస్.ఈశ్వర్(సత్తెనపల్లి), 93 కేజీల్లో పి.అశోక్(సత్తెనపల్లి), 120 కేజీల్లో ఎల్.శివ నాగేశ్వరరావు(గుడిపూడి), మాస్టర్స్ విభాగం నుంచి 105 కేజీల్లో కె.జ్యోతి బాబు(గురజాల) నుంచి ఎంపికయ్యారు. కార్యక్రమంలో పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జిమ్ రాజు, గుజ్జర్లపూడి ఆనంద్, జి.రమేష్, ఎస్.మణిరత్నం, టి.శంకర్, కత్తి పవన్ కుమార్, షేక్ జానీ, సయ్యద్ మస్తాన్, పి.విశ్వనాథ్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ మాతంగి సాంబశివరావు, శాంతయ్య పాల్గొన్నారు.

వలకు చిక్కిన మొసలి



మాచవరం: పిల్లుట్ల గ్రామ శివారులోని సింగరాయపాలెం తండాకు వెళ్లే మార్గంలోని వాగులో వలకు మొసలి చిక్కింది. గ్రామానికి చెందిన కొందరు యువకులు శుక్రవారం చేపల కోసం వల వేయగా మొసలి చిక్కింది. విషయాన్ని వారు గ్రామ సచివాలయ అధికారులకు తెలియజేశారు. స్థానిక అధికారులు అందించిన సమాచారంతో అటవీశాఖ అధికారులు గ్రామానికి వచ్చి మొసలిని బంధించి, నాగార్జున సాగర్‌లోని సంరక్షణా కేంద్రానికి తరలించారు.

ప్రజలకు సేవ చేయడం అదృష్టం



ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

గుంటూరు వెస్ట్: ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశంగా ఖ్యాతిగాంచిన మన దేశంలో ప్రజలకు సేవ చేయడం అదృష్టంగా భావించాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో 16వ సివిల్ సర్వీసెస్ డే శుక్రవారం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ కాలంతో ప్రజల అవసరాలు కూడా మారిపోతున్నాయని చెప్పారు. పెరుగుతున్న టెక్నాలజీని అర్థం చేసుకోవడంతోపాటు ఉత్తమ సేవలందించేందుకు కృషి చేయాలని సూచించారు. ముఖ్యంగా ప్రజలతో మర్యాదగా మాట్లాడడం, ఓపిగ్గా సమస్యలు తెలుసుకోవడం చాలా అవసరమన్నారు. ప్రజల సమస్యలు పరిష్కరించే ఉద్యోగులకు వారే బ్రహ్మరథం పడతారని చెప్పారు. సివిల్ సర్వెంట్స్‌తో పాటు ఉద్యోగులకు ప్రభుత్వాలు రూ.లక్షలు ఖర్చు చేసి అనేక సదుపాయాలు, వసతులు కల్పిస్తుందన్నారు. ఇవన్నీ ప్రజల నుంచి వచ్చినవేనని గుర్తుంచుకోవాలని చెప్పారు. జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ ఉన్నతాధికారులు, ఉద్యోగులు సమన్వయంతో పనిచేస్తేనే మంచి ఫలితాలు వస్తాయని చెప్పారు. అనంతరం ప్రజలకు ఉత్తమ సేవలందిస్తామని జిల్లా కలెక్టర్, జేసీ, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ శివన్నారాయణ శర్మ, డీఆర్వో చంద్రశేఖర రావు, ప్రతిజ్ఞ చేయించారు. ఉన్నతాధికారులను ఉద్యోగులు ఘనంగా సత్కరించారు.

సంక్షేమ పాలనకే ప్రజల మద్దతు

రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు



వృద్ధురాలికి సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: అన్ని వర్గాలకు ఆర్థిక భరోసా కల్పిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేస్తున్న సంక్షేమ పాలనకే ప్రజల మద్దతు లభిస్తోందని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. 'జగనన్నే మా భవిష్యత్.. మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమంలో భాగంగా సత్తెనపల్లి మండలం కట్టమూరులో శుక్రవారం పర్యటించారు. ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలపై ఆరా తీసి ప్రజా మద్దతు పుస్తకంలోని ఐదు ప్రశ్నలను ఇంటిలోని సభ్యులను అడిగి వారి అభిప్రాయాలను సేకరించారు. మంత్రి మాట్లాడుతూ పాలనపరంగాను, పార్టీ బలోపేతానికి సంస్కరణలు, సాహసోపేతమైన నిర్ణయాలతో సంచలనం సృష్టిస్తున్న యువ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి తల పెట్టిన జగనన్నే మా భవిష్యత్‌కు విశేష ఆదరణ లభిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుకుంటున్న లబ్ధిదారులు జగనన్న పాలనకు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నారని వివరించారు. మరోసారి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించుకుంటామని ప్రగాఢ విశ్వాసంతో చెబుతున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సత్తెనపల్లి రూరల్ కన్వీనర్ రాయపాటి పురుషోత్తమరావు, రాష్ట్ర రైతు సలహా మండలి సభ్యుడు కళ్లం విజయభాస్కర్ రెడ్డి, పల్నాడు జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు, కౌన్సిలర్ అచ్యుత శివప్రసాద్, జేసీఎస్ ఇన్‌చార్జి బూతుకూరి వెంకటరెడ్డి, జిల్లా యువజన విభాగం కార్యదర్శి చిలుకా జయపాల్, నాయకులు షేక్ ఎలవర్తిపాటి ఈసా, సంకటి శ్యాంసన్, మందడపు పృధ్వి, సర్పంచ్ కొండలు, మాజీ సర్పంచ్‌లు దావీదు, రోశయ్య, ఎంపిటిసి సభ్యులు గోపయ్య, మాగంటి నరసింహారావు పాల్గొన్నారు.

పకడ్బందీగా టెన్త్ మూల్యాంకనం

- విధుల్లో పాల్గొంటున్న ఉపాధ్యాయులకు రెమ్యూనరేషన్ పెంపు
- ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ దేవానందరెడ్డి



టెన్త్ స్పాట్ వాల్యుయేషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న దేవానందరెడ్డి

గుంటూరు ఎడ్యుకేషన్: పదో తరగతి స్పాట్ వాల్యూయేషన్ ప్రక్రియను పూర్తిస్థాయి భద్రతా ఏర్పాట్ల మధ్య పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ పరీక్షల విభాగ డైరెక్టర్ డి.దేవానందరెడ్డి చెప్పారు. నగరంపాలెంలోని స్టాల్ బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన టెన్త్ స్పాట్ వాల్యూయేషన్ కేంద్రాన్ని దేవానందరెడ్డి శుక్రవారం సందర్శించారు. స్పాట్ వాల్యూయేషన్ కేంద్రంలో జవాబు పత్రాలకు మూల్యాంకనం జరుగుతున్న తీరును పరిశీలించి, విధుల్లో పాల్గొంటున్న ఉపాధ్యాయులకు చేసిన ఏర్పాట్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విధుల్లో పాల్గొంటున్న ఉపాధ్యాయులకు ప్రభుత్వం రెమ్యూనరేషన్ పెంచిందని చెప్పారు. జవాబు పత్రాల మూల్యాంకనంలో తప్పిదాలకు ఆస్కారం లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని డీఈవో పి.శైలజకు సూచించారు. మూల్యాంకనం పూర్తయ్యే వరకు పూర్తిస్థాయిలో పర్యవేక్షణ జరపాలని ఆదేశించారు. మూల్యాంకన కేంద్రంలో ఉపాధ్యాయులకు చల్లటి తాగునీటితోపాటు మహిళా ఉపాధ్యాయినులకు విడిగా మరుగుదొడ్లు నిర్మించడంపై క్యాంపు అధికారి పి.శైలజ, డెప్యూటీ క్యాంపు అధికారి కె.సుధాకర్‌రెడ్డితోపాటు ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ వెంకట్‌రెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసిం పాల్గొన్నారు.

గుంటూరులో సీఏటీని ఏర్పాటు చేయండి

– కేంద్ర న్యాయ శాఖ మంత్రికి ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు విజ్ఞప్తి



వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): కేంద్రప్రభుత్వ ఉద్యోగుల జీతాలు, పదోన్నతులు, పెన్షన్ సమస్యలు, బకాయిల వివాదాల పరిష్కారానికి రాజ్యాంగబద్ధంగా ఉన్న సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ (సీఏటీ)ని ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరులో ఏర్పాటు చేయాలని కేంద్ర న్యాయశాఖ మంత్రి కిరణ్ రిజిజును నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఢిల్లీలో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఏపీలో ఇప్పటికీ క్యాట్ బెంచ్ లేదని, ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉన్న బెంచ్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రెండు రాష్ట్రాల్లోని.. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు సేవలు అందిస్తోందని, ఏపీలోనే 50,000 మందికి పైగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు ఉన్నారని, క్యాట్ బెంచ్ లేకపోవడం వల్ల వీరు ఇబ్బంది పడుతున్నారని, వారి కష్టాలను దృష్టిలో ఉంచుకుని, గుంటూరు జిల్లాలో శాశ్వత క్యాట్ బెంచ్‌ను ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని ఎంపీ కేంద్రమంత్రికి విన్నవించారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో స్టేడియం లిఫ్టర్లకు జాతీయ పతకాలు



గుంటూరు వెస్ట్ (క్రీడలు): ఈ నెల 15న హైదరాబాద్‌లో జరిగిన సౌత్‌జోన్ మాస్టర్స్ జాతీయ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో స్థానిక బీఆర్ స్టేడియంలోని హెల్త్‌క్లబ్ జిమ్‌కు చెందిన లిఫ్టర్లు బంగారు పతకాలు సాధించారని డీఎస్ఏ చీఫ్ కోచ్ జి.వెంకటేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వి.దుర్గా ప్రసాద్, కె.నాగరాజు, బీవీఎల్ నరసింహారావు, ఎం.శ్రీనివాస్ కుమార్ మొత్తం నాలుగు బంగారు పతకాలు గెలుపొందారని చెప్పారు. ఈ సందర్భంగా కోచ్ కమురుద్దీన్, పతకాలు సాధించిన లిఫ్టర్లను సత్కరించామని వెల్లడించారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడి మృతి

నరసరావుపేట ఈస్ట్: పదో తరగతి పశ్నపత్రాల మూల్యాంకనం విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు గుండెపోటుతో మృతి చెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. పల్నాడు జిల్లా రొంపిచర్ల మండలం వీరవట్నం గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలో బి.జోజప్ప(50) పనిచేస్తున్నాడు. మూల్యాంకనానికి స్పెషల్ అసిస్టెంట్ విధులకు సెయింటాన్స్ పాఠశాలకు వచ్చారు. ఉదయం పూట విధులను ముగించుకొని భోజనానంతరం విధులకు హాజరయ్యారు. కొద్దిసేపటికే ఒక్కసారిగా కుప్పకూలిపోవటంతో తోటి ఉపాధ్యాయులు జోజప్పను దగ్గరలోని ప్రైవేటు హాస్పటల్‌కు తీసుకవెళ్లారు. చికిత్స పొందుతూ జోజప్ప మృతి చెందినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. జోజప్ప స్వగ్రామం ఫిరంగిపురం. 2002 డీఎస్సీలో ఉపాధ్యాయునిగా ఎంపికయ్యారు. జోజప్ప మృతికి జిల్లా విద్యాశాధికారి కె.శామ్యూల్, డెప్యూటీ డీఈఓ వేణుగోపాలరావు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

ఎంతో పుణ్యకార్యం ఇఫ్తార్ విందు

వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని



ఇఫ్తార్ విందులో పాల్గొన్న మంత్రి విడదల రజిని

చిలకలూరిపేట: పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని నియమ నిష్టలతో ఉపవాసాలు ఆచరించే ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం పుణ్యకార్యమని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. పట్టణంలోని అబ్బాస్‌నగర్‌లో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు పఠాన్ తలహాఖాన్, పార్టీ సీనియర్ నాయకులు సయ్యద్ బషీర్ మేస్త్రి సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా మంత్రి విడదల రజిని పాల్గొన్నారు. ముందుగా ముఫ్తీ అనస్‌ఖాన్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థన నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి రజిని మాట్లాడుతూ పవిత్ర రంజాన్ దినాలలో భక్తి శ్రద్ధలతో కఠోర ఉపవాస దీక్ష లుండే వారిని గౌరవించి, అనుసరించాలని పవిత్ర గ్రంథం ఖురాన్ బోధిస్తుందని వెల్లడించారు. అలా చేసే వారిపై దైవం ఎనలేని అనుగ్రహ భాగ్యాలను వర్షిస్తాడని ఇస్లామిక్ పండితులు చెబుతారని పేర్కొన్నారు. ఇతరుల ఆకలి, దప్పికల బాధను తెలిపే ఉపవాసాలంటే అల్లాహ్‌కు ఎంతో ప్రియమని వివరించారు. ప్రభుత్వం ముస్లిం సంక్షేమానికి కట్టుబడి ఉందని చెప్పారు. నాడు మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్ కల్పించిన విషయాన్ని గుర్తు చేశారు. అలాగే ఆయన తనయుడు నేటి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముస్లింల సంక్షేమానికి ఎన్నో పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపి, భోజనాలు వడ్డించారు. కార్యక్రమంలో చిలకలూరిపేట, నాదెండ్ల జెడ్పీటీసీ సభ్యులు కోడే సుధారాణి, కాట్రగడ్డ మస్తాన్‌రావు, రాష్ట్ర ముస్లిం కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ దరియావలి, వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి షేక్ అల్లీమియా, పట్టణ అధ్యక్షుడు బేరింగ్ మౌలాలి నాయకులు పాల్గొన్నారు.

సేద్యం అభివృద్ధికి సమష్టి కృషి

- ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ మార్కెటింగ్ సలహాదారు బ్రహ్మానందరెడ్డి
- ముగిసిన వ్యవసాయ పరిశోధన విస్తరణ సలహా మండలి సమావేశం

గుంటూరు రూరల్: వ్యవసాయ రంగం అభివృద్ధికి శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖ అధికారులు సమష్టిగా కృషిచేయాల్సిన అవసరం ఉందని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ, మార్కెటింగ్ అడ్వైజర్ బి.బ్రహ్మానందరెడ్డి చెప్పారు. నగర శివారుల్లోని లాంఫాం వ్యవసాయ పరిశోధన స్థానంలో పరిశోధన సంచాలకురాలు డాక్టర్ ఎల్.ప్రశాంతి అధ్యక్షతన జరిగిన ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, కృష్ణ జిల్లాల (కృష్ణ మండలం) వ్యవసాయ పరిశోధన, విస్తరణ, సలహా మండలి సమావేశం శుక్రవారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ దేశాభివృద్ధిలో ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పాత్రను అభినందించారు. క్షేత్రస్థాయిలో రైతులవద్దే విత్తనోత్పత్తికి ప్రోత్సాహం అందించాలని అధికారులకు సూచించారు. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఎ.విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ కృషి విజ్ఞాన కేంద్రాలలో దేశ వ్యాప్తంగా మంచి ఆదాయాన్ని అందించే గృహ విజ్ఞాన, ఉద్యాన సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు అందించి వారికి అధిక ఆదాయం లభించేలా కృషిచేయాలని సూచించారు. కృషి విజ్ఞాన కేంద్రం, ఏరువాక కేంద్రాల కో–ఆర్డినేటర్లు వారి జిల్లాలలో ఉన్న పంటలలో చేపట్టిన ప్రగతిని, వివరించారు. వరి, అపరాలు, పత్తి, చెరకు, చిరుధాన్యాలు, వేరుశనగ, యాంత్రీకరణ, విస్తరణ అంశాలపై శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖ అధికారులతో చర్చించారు. పంటల్లో తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులు, ఆధునిక వ్యవసాయం గురించి చేపట్టాల్సిన అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథులను సన్మానించారు. కార్యక్రమంలో విస్తరణ సంచాలకులు డాక్టర్ ఎ.సుబ్బరామిరెడ్డి, లాంఫాం ఏడీఆర్ డాక్టర్ జి సుబ్బారావు, గుంటూరు, పల్నాడు, కృష్ణ, ఎన్టీఆర్, ప్రకాశం, బాపట్ల జిల్లాల వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు, రైతులు, అనుబంధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న గంజాయి స్వాధీనం

మార్టూరు: గంజాయిని అక్రమంగా తరలిస్తున్న వ్యక్తుల ఆట కట్టించారు పోలీసులు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన విలేకరుల సమావేశంలో బాపట్ల డీఎస్పీ ఏ శ్రీనివాసరావు వివరాలు వెల్లడించారు. కేరళ రాష్ట్రం మలప్పురం జిల్లా బలకార గ్రామానికి చెందిన మొయిద్దీన్ కుట్టి, అదే జిల్లా తెన్నాల పుతువరంబ గ్రామానికి చెందిన సుధీష్, కరణ్ స్నేహితులు. వీరిద్దరు మరో ఇద్దరు వ్యక్తులు నాగరాజు, శరత్‌కుమార్‌లు కలిసి రెండు కార్లలో గంజాయిని అన్నవరం, రాజమండ్రి ప్రాంతాల నుంచి కేరళ రాష్ట్రం తరలించటానికి గురువారం ఉదయం బయలుదేరారు. స్థానిక రాజుపాలెం కూడలి వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న సీఐ ఎస్కె టీ ఫిరోజ్ బృందాన్ని చూసి దుండగులు దేగరమూడి వైపు పరారయ్యారు. పోలీసులు వాహనాన్ని వెంబడించి మొయిద్దీన్ కుట్టి, సుధీష్, కోరనాథ్‌లను అదుపులోనికి తీసుకొని వారి నుంచి రెండు కిలోల బరువు గల 20 ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. రెండో వాహనం కోసం వెతికిన అధికారులకు దేగరమూడి వాగు సమీపంలో నిలిపి ఉంచిన కారును పరిశీలించగా అందులో 100 కిలోలకు సమానమైన 2 కిలోల ప్యాకెట్లు 50 లభించాయి. నిందితులు నాగరాజు, శరత్‌కుమార్‌లు పారిపోగా అధికారులు కారును మొత్తం 140 కిలోల గంజాయిని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. చాకచక్యంగా గంజాయి అక్రమ రవాణాను అడ్డుకున్న సీఐ ఫిరోజ్, ఎస్సై కమలాకర్, ఏఎస్సై సైదా సిబ్బంది కోటేశ్వరరావు, ప్రసాద్, నరేంద్ర, రాజేష్‌లకు ఎస్పీ వకుల్ జిందాల్ ఎనిమిది అవార్డులు ప్రకటించినట్లు డీఎస్పీ తెలిపారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	23	59,655
నిఫ్టీ	0	17,624

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ		మార్పు
నాస్డాక్	12,077	▲	20
డోజోన్స్	33,876	▲	8
ఎఫ్టీఎస్ఈ 100	7,914	▲	12
డాక్స్	15,882	▲	86
షాంఘై	3,301	▼	2
నికాయ్	28,564	▲	93

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (24 క్యారెట్)	60,191	▼	425
బంగారం (22 క్యారెట్)	59,950	▼	423
వెండి (కేజీ)	74,773	▼	646

సింఫనీ బీఎల్డీసీ ఎయిర్కూలర్లు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రపంచంలో తొలిసారిగా బ్రష్లెస్ డీసీ ఎలక్ట్రిక్ మోటార్ (బీఎల్డీసీ) టెక్నాలజీతో పనిచేసే ఎయిర్ కూలర్లను సింఫనీ భారత మార్కెట్లోకి విడుదల చేసింది. సంప్రదాయ ఎయిర్కూలర్లతో పోలిస్తే ఇవి 60 శాతం తక్కువ విద్యుత్ను వినియోగిస్తాయని కంపెనీ వెల్లడించింది. 30, 55, 80 లీటర్ల సామర్థ్యంతో మూడు మోడళ్లను అందుబాటులోకి తెచ్చినట్టు సింఫనీ సీఎండీ అచల్ బకేరీ తెలిపారు.

తనిష్క్ నుంచి 'స్టన్నింగ్ ఎవ్రీ ఇయర్' చెవి రింగులు



హైదరాబాద్: టాటా గ్రూప్ కంపెనీ తనిష్క్ అక్షయ తృతీయ సందర్భంగా బంగారం, వజ్రాలతో తీర్చిదిద్దిన చెవి రింగులను 'స్టన్నింగ్ ఎవ్రీ ఇయర్' పేరిట విడుదల చేసింది. ఈ నూతన కలెక్షన్లో సంప్రదాయ ఝుంకీలు, ఆకర్షణీయ స్టడ్లు, డ్రాప్ ఇయర్ రింగ్స్ మరెన్నో ఉన్నాయి. వీటిని 18 క్యారెట్, 22 క్యారెట్లలో రూపొందించారు. పండుగ వేళ బంగారు ఆభరణాల మేకింగ్, డైమండ్ జ్యువెలరీ విలువపై 20% తగ్గింపు అందిస్తుంది. ఈ ఏప్రిల్ 24 వరకు ఈ ఆఫర్ అందుబాటులో ఉంటుంది.

కోడిగుడ్లు (హోల్సేల్-నెక్ / 100కు రూ.లలో)

22-4-2023	
విశాఖ	375-00
చిత్తూరు	418-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	365-00
విజయవాడ	365-00
రిటైల్ ధర (డజను)	60.00
21-4-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	358-00
వరంగల్	360-00
రిటైల్ ధర	4.20

రిలయన్స్ లాభాల రికార్డ్!

- క్యూ4లో నికర లాభం రూ. 19,299 కోట్లు
- కంపెనీ చరిత్రలోనే అత్యధికం
- రూ. 10 లక్షల కోట్లకు ఆదాయం

న్యూఢిల్లీ: డైవర్సిఫైడ్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్(ఆర్ఐఎల్) గత ఆర్థిక సంవత్సరం(2022-23) చివరి త్రైమాసికంలో సరికొత్త రికార్డును సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జనవరి-మార్చి(క్యూ4)లో నికర లాభం 19 శాతం ఎగసి రూ. 19,299 కోట్లను తాకింది. ఒక త్రైమాసికానికి కంపెనీ చరిత్రలోనే ఇది అత్యధికంకాగా.. అంతక్రితం ఏడాది(2021-22) క్యూ4లో రూ. 16,203 కోట్లు మాత్రమే ఆర్జించింది. రిటైల్, టెలికం విభాగాలతోపాటు చమురు, పెట్రోకెమికల్స్ బిజినెస్ వృద్ధి ఇందుకు దోహదం చేసింది. మొత్తం ఆదాయం సైతం రూ. 2.14 లక్షల కోట్ల నుంచి రూ. 2.19 లక్షల కోట్లకు బలపడింది. ఇక మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి రూ. 66,702 కోట్ల నికర లాభం ఆర్జించింది. ఇది కూడా సరికొత్త రికార్డుకాగా.. 2021-22లో రూ. కేవలం 60,705 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం దాదాపు రూ. 10 లక్షల కోట్లకు చేరింది. 2021-22లో రూ. 7.36 లక్షల కోట్ల ఆదాయం మాత్రమే అందుకుంది. పూర్తి ఏడాదికి ఆర్ఐఎల్ నిర్వహణ లాభం(ఇబిటా) తొలిసారి రూ. 1,54,691 కోట్లను తాకింది. ఇది 23 శాతం వృద్ధి. ఈ కాలంలో పెట్టుబడి వ్యయాలు రూ. 1,41,809 కోట్లుకాగా.. కంపెనీవద్దగల రూ. 1,93,282 కోట్ల నగదు బ్యాలెన్స్ను మినహాయిస్తే నికర రుణ భారం వార్షిక ఇబిటాకంటే తక్కువగా రూ. 1,10,218 కోట్లుగా నమోదైంది.

అన్ని విభాగాల జోరు: క్యూ4లో ఆర్ఐఎల్ ఇబిటా 22 శాతం జంప్చేసి రూ. 41,389 కోట్లను తాకింది. రిఫైనింగ్, పెట్రోకెమికల్స్(ఓటూసీ) ఇబిటా 14 శాతంపైగా ఎగసి రూ. 16,293 కోట్లకు, టెలికంసహా డిజిటల్ సర్వీసులు 17 శాతం మెరుగుపడి రూ. 12,767 కోట్లకు, రిటైల్ విభాగం 33 శాతం దూసుకెళ్లి రూ. 4,769 కోట్లకు, ఆయిల్, గ్యాస్ ఇబిటా రెట్టింపై రూ. 3,801 కోట్లకు చేరాయి. డీజిల్, ఏటీఎఫ్ ఎగుమతులపై విండ్ఫాల్ ట్యాక్స్ లాభాలపై రూ. 711 కోట్లమేర ప్రభావం చూపినట్లు ఆర్ఐఎల్ పేర్కొంది. అంతక్రితం క్యూ4లో రూ. 1,898 కోట్లమేర ప్రభావం పడినట్లు ప్రస్తావించింది.

ఆర్ఐఎల్ షేరు స్వల్ప వృద్ధితో 2,351 వద్ద క్లోజైంది. మార్కెట్ ముగిశాక ఫలితాలు వెలువడ్డాయి.



ఆర్థిక వృద్ధిలో భాగం

డిజిటల్ కనెక్టివిటీ, ఆర్గనైజ్డ్ రిటైల్ విభాగాలలో కంపెనీ కార్యకలాపాలు వ్యవస్థాగత సామర్థ్యాలకు బలాన్నిస్తున్నాయి. తద్వారా ప్రపంచంలోనే వేగవంత వృద్ధిని సాధిస్తున్న ఆర్థిక వ్యవస్థలో భాగమవుతున్నాయి. ఫైనాన్షియల్ సర్వీసుల విభాగాన్ని విడదీసి జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ పేరుతో లిస్ట్ చేయనున్నాం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023-24)లో ఎంజే ఫీల్డ్, ఆర్క్లస్టర్ తదితరాలతో కలిపి కేజీ-డీ6 బ్లాకులో గ్యాస్ ఉత్పత్తి రోజుకి 3 కోట్ల ప్రామాణిక ఘనపుమీటర్లకు చేరే వీలుంది.

–ముకేశ్ అంబానీ, రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మన్, ఎండీ

రిలయన్స్ రిటైల్ భళా

గతేడాది(2022-23) క్యూ4(జనవరి-మార్చి)లో రిలయన్స్ రిటైల్ నికర లాభం 13 శాతం వృద్ధితో రూ. 2,415 కోట్లను తాకింది. 2021-22 క్యూ4లో రూ. 2,139 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం మరింత అధికంగా 21 శాతం ఎగసి రూ. 61,559 కోట్లకు చేరింది. అంతక్రితం క్యూ4లో రూ. 50,834 కోట్ల అమ్మకాలు సాధించింది. ఆదాయంలో డిజిటల్, న్యూ కామర్స్ బిజినెస్ వాటా 17 శాతానికి చేరింది. ఇక మొత్తం స్టోర్ల సంఖ్య 18,040కు చేరింది. క్యూ4లో 2,844 స్టోర్లను జత చేసుకుంది. సర్వీసులతో కలిపి క్యూ4లో ఆదాయం రూ. 69,267 కోట్లను తాకగా.. ఇబిటా 33 శాతం వృద్ధితో రూ. 4,914 కోట్లకు చేరింది. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి మొత్తం ఆదాయం 32 శాతం జంప్చేసి రూ. 2,30,931 కోట్లను తాకింది. నికర లాభం 30 శాతం ఎగసి రూ. 9,181 కోట్లయ్యింది. సర్వీసులతో కలిపి స్థూల ఆదాయం రూ. 2,60,364 కోట్లుగా నమోదైంది. దేశీయంగా రిటైల్ రంగంలో రిలయన్స్ అత్యుత్తమ వృద్ధిని చూపుతున్నట్లు కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఈషా ఎం.అంబానీ పేర్కొన్నారు.

జియో లాభం జూమ్

క్యూ4లో రూ. 4,984 కోట్లు



న్యూఢిల్లీ: ఆర్ఐఎల్ అనుబంధ సంస్థ, డిజిటల్ సర్వీసుల దిగ్గజం జియో ప్లాట్ఫామ్స్ గత ఆర్థిక సంవత్సరం(2022-23) చివరి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జనవరి-మార్చి(క్యూ4)లో నికర లాభం 16 శాతం బలపడి రూ. 4,984 కోట్లను తాకింది. అంతక్రితం ఏడాది(2021-22) క్యూ4లో రూ. 4,313 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 14 శాతం పుంజుకుని రూ. 25,465 కోట్లను తాకింది. అంతక్రితం క్యూ4లో రూ. 22,261 కోట్ల ఆదాయం నమోదైంది. ఒక్కో వినియోగదారునిపై సగటు ఆదాయం (ఏఆర్పీయూ) 6.7 శాతం మెరుగై రూ. 178.8కు చేరింది. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి నికర లాభం 23 శాతం జంప్చేసి రూ. 19,124 కోట్లయ్యింది. 2021-22లో రూ. 15,487 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం 20 శాతం ఎగసి రూ. 1,15,099 కోట్లకు చేరింది. క్యూ4లో 2.9 కోట్లమంది జత కలవడంతో మొత్తం కస్టమర్ల సంఖ్య 7 శాతం పెరిగి 43.93 కోట్లను తాకింది.

సంపదలో 6 శాతం పుత్తడికి..



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: భారత్తోపాటు చైనాకు చెందిన అల్ట్రా-హై నెట్ వర్త్ వ్యక్తులు (యూహెచ్ఎన్డబ్ల్యూఐ) గత సంవత్సరం పెట్టుబడి పెట్టదగిన సంపదలో 6 శాతం బంగారంలో ఉంచారని ప్రాపర్టీ కన్సల్టెంట్ నైట్ ఫ్రాంక్ ఇండియా నివేదిక వెల్లడించింది. '8 శాతం కేటాయింపులతో ఆస్ట్రేలియాకు చెందిన యూహెచ్ఎన్డబ్ల్యూఐలు తొలి స్థానంలో నిలిచారు. ప్రపంచవ్యాప్తంగా సగటు 3 శాతం కాగా, ఆసియా పసిఫిక్ ప్రాంతంలో ఇది 4 శాతంగా ఉంది. పెట్టుబడి పెట్టదగిన సంపదలో బంగారానికి భారతీయులు చేసిన కేటాయింపులు 2018లో 4 శాతం నమోదైంది. సంవత్సరాలుగా పుత్తడి అందించిన గణనీయమైన రాబడి ఈ పెరుగుదలకు కారణం. 2018-19 నుంచి 2022-23 మధ్య పసిడి 69 శాతం కంటే ఎక్కువగా రాబడిని అందించింది. మహమ్మారి తక్కువ వడ్డీ రేటుకు దారితీసింది. అంతర్జాతీయ కేంద్ర బ్యాంకులు అనుసరించిన సులభ నగదు లభ్యత వ్యూహం ధరలను భారీగా పెంచింది' అని నివేదిక వివరించింది. ఆర్థిక అనిశ్చితి నేపథ్యంలో స్థిరత్వాన్ని అందించే, ద్రవ్యోల్బణానికి వ్యతిరేకంగా పనిచేసే సాధనాలను ఆశ్రయిస్తున్నారని నైట్ ఫ్రాంక్ ఇండియా సీఎండీ శిశిర్ బైజల్ తెలిపారు.

హింద్ జింక్ లాభం క్షీణత

క్యూ4లో రూ. 2,583 కోట్లకు పరిమితం

HINDUSTAN ZINC
Zinc of India

న్యూఢిల్లీ: హిందుస్తాన్ జింక్ గత ఆర్థిక సంవత్సరం(2022-23) చివరి త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జనవరి-మార్చి (క్యూ4)లో నికర లాభం 12 శాతం క్షీణించి రూ. 2,583 కోట్లకు పరిమితమైంది. పెరిగిన వ్యయాలు ప్రభావం చూపాయి. అంతక్రితం ఏడాది(2021-22) క్యూ4లో రూ. 2,928 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 9,074 కోట్ల నుంచి రూ. 8,863 కోట్లకు నీరసించింది. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి నికర లాభం రూ. 10,511 కోట్లకు ఎగసింది.

సెన్సెక్స్ లాభం, నిఫ్టీ అక్కడే

- ట్రేడింగ్లో ఒడిదుడుకులు
- ఆటో, మెటల్ షేర్లలో అమ్మకాలు



ముంబై: జాతీయ, అంతర్జాతీయంగా ట్రేడింగ్ ప్రభావితం చేసే కీలకాంశాలేవీ లేకపోవడంతో స్టాక్ సూచీలు శుక్రవారం మిశ్రమంగా ముగిశాయి. ఫ్లాటుగా ప్రారంభమైన సూచీలు క్రమంగా నష్టాల్లోకి జారుకున్నాయి. మిడ్ సెషన్ నుంచి మెటల్, ఎఫ్ఎంసీజీ, ఐటీ షేర్లు రాణించడంతో ఆరంభ నష్టాలను భర్తీ చేసుకోగలిగాయి. ఉదయం సెన్సెక్స్ 94 పాయింట్ల నష్టంతో 59,538 వద్ద మొదలైంది. ట్రేడింగ్లో 369 పాయింట్ల పరిధిలో 59,413 వద్ద కనిష్టాన్ని, 59,781 వద్ద గరిష్టాన్ని తాకింది. చివరికి 23 పాయింట్లు పెరిగి 59,655 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 16 పాయింట్ల లాభంతో 17,640 ప్రారంభమైంది. ఇంట్రాడేలో 17,554 – 17,663 వద్ద రేంజ్లో కదలాడింది. ఆఖరికి ఎలాంటి లాభనష్టాలకు లోనవకుండా గురువారం ముగింపు 17,624 వద్దే స్థిరపడింది. ఎఫ్ఎంసీజీ, ఐటీ, మీడియా, ఫార్మా షేర్లకు రాణించాయి. మెటల్, ఆటో, ఫైనాన్స్, బ్యాంకింగ్, రియల్టీ, వినిమయ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి.



ఆధిక్యంలో అర్జున్

సాటీ జుల్డిజ్ ఓపెన్ అంతర్జాతీయ ర్యాపిడ్ చెస్ టోర్నీలో ఎనిమిది రౌండ్ల తర్వాత తెలంగాణ గ్రాండ్మాస్టర్ ఇరిగేశి అర్జున్ ఏడు పాయింట్లతో ఒంటరిగా ఆధిక్యంలో నిలిచాడు. శుక్రవారం జరిగిన నాలుగు గేముల్లో మూడింట గెలిచిన అర్జున్, మరో గేమ్ను 'డ్రా' చేసుకున్నాడు. వఖిదోవ్ (ఉజ్బెకిస్తాన్), బిబిసారా (కజకిస్తాన్), బోరిస్ గెల్ఫాండ్ (ఇజ్రాయెల్)లపై నెగ్గిన అర్జున్ జర్మనీ గ్రాండ్మాస్టర్ విన్సెంట్ కీమెర్తో జరిగిన గేమ్ను 'డ్రా'గా ముగించాడు. 12 మంది అగ్రశ్రేణి ప్లేయర్ల మధ్య 11 రౌండ్లపాటు ఈ టోర్నీని నిర్వహిస్తున్నారు. నేడు చివరి మూడు రౌండ్లు జరుగుతాయి.

'పారిస్' టికెట్ల కోసం 40 లక్షల మంది దరఖాస్తు

వచ్చే ఏడాది జరిగే పారిస్ ఒలింపిక్స్ క్రీడలను ప్రత్యక్షంగా తిలకించేందుకు రెండో దశలో 40 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. వచ్చే నెలలో ఆన్లైన్ లాటరీ ద్వారా 13 లక్షల మందిని ఎంపిక చేస్తారు. తొలి దశలో 32 లక్షల టికెట్లు అమ్ముడుపోయాయి.

PARIS 2024

పసిడి పోరుకు జ్యోతి సురేఖ జోడీ


జ్యోతి సురేఖ, ఓజస్ ప్రవీణ్

అంటాల్యా (తుర్కియే): ప్రపంచకప్ ఆర్చరీ స్టేజ్-1 టోర్నీలో కాంపౌండ్ మిక్స్డ్ టీమ్ ఈవెంట్లో భారత్కు పతకం ఖరారైంది. భారత్కు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ అమ్మాయి వెన్నం జ్యోతి సురేఖ, మహారాష్ట్ర ప్లేయర్ ఓజస్ ప్రవీణ్ దేవ్తలె ద్వయం ఫైనల్లోకి దూసుకెళ్లింది. తొలి రౌండ్లో 'బై' పొందిన సురేఖ-ఓజస్ రెండో రౌండ్లో 159-157తో మరియా-గైల్స్ (లక్సెంబర్గ్)లపై... క్వార్టర్ ఫైనల్లో 159-156తో సోఫీ-అడ్రియన్ గోంటీర్ (ఫ్రాన్స్)లపై... సెమీఫైనల్లో 157-155తో ఫాతిన్ నూర్ఫతే-జువైది (మలేసియా)లపై గెలిచారు. నేడు జరిగే ఫైనల్లో చెన్ యి సువాన్-చెన్ చియె లున్ (చైనీస్ తైపీ)లతో జ్యోతి సురేఖ-ఓజస్ తలపడతారు. రికర్వ్ మిక్స్డ్ టీమ్ ఈవెంట్లో మాత్రం అతాను దాస్-భజన్ కౌర్ (భారత్) ద్వయం తొలి రౌండ్లో 3-5తో డెన్మార్క్ జోడీ చేతిలో ఓడిపోయింది.



ధీరజ్ అద్భుతం...

పురుషుల రికర్వ్ వ్యక్తిగత విభాగంలో ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ ధీరజ్ బొమ్మదేవర అద్భుత ప్రదర్శనతో సెమీఫైనల్లోకి దూసుకెళ్లాడు. తొలి రౌండ్లో ధీరజ్ 6-0తో థియో కార్బొనెటి (బెల్జియం)పై, రెండో రౌండ్లో 6-4తో కెజియా చాబిన్ (స్విట్జర్లాండ్)పై, మూడో రౌండ్లో 6-4తో జిగా రావ్నికర్ (స్లొవేనియా)పై, నాలుగో రౌండ్లో 6-5తో అమెరికా దిగ్గజం బ్రాడీ ఇలిసన్పై, క్వార్టర్ ఫైనల్లో 6-4తో తరుణ్దీప్ రాయ్ (భారత్)పై గెలుపొందాడు. ప్రపంచ మాజీ చాంపియన్, మూడు ఒలింపిక్ పతకాలు నెగ్గిన ఇలిసన్తో జరిగిన మ్యాచ్లో ధీరజ్ 'షూట్ ఆఫ్'లో గెలిచాడు. ఇద్దరూ 10 పాయింట్లు స్కోరు చేసినా ధీరజ్ కొట్టిన బాణం 10 పాయింట్ల లక్ష్యబిందువుకు అతి సమీపంలో ఉండటంతో విజయం ఖరారు చేసుకున్నాడు.

మే 28న అహ్మదాబాద్లో ఐపీఎల్ ఫైనల్



న్యూఢిల్లీ: ఐపీఎల్ 16వ సీజన్ ప్లే ఆఫ్ దశ షెడ్యూల్ను బీసీసీఐ శుక్రవారం ప్రకటించింది. మే 23న క్వాలిఫయర్-1 మ్యాచ్కు... మే 24న ఎలిమినేటర్ మ్యాచ్కు చెన్నైలోని ఎం.ఎ.చిదంబరం స్టేడియం వేదికగా నిలుస్తుంది. మే 26న అహ్మదాబాద్లోని నరేంద్ర మోదీ స్టేడియం క్వాలిఫయర్-2 మ్యాచ్కు, మే 28న ఫైనల్ మ్యాచ్కు ఆతిథ్యం ఇస్తుందని బీసీసీఐ కార్యదర్శి జై షా తెలిపారు.

సందీప్ లమిచానె రికార్డు



కీర్తిపూర్ (నేపాల్): వన్డే క్రికెట్లో అత్యంత వేగంగా 100 వికెట్లు పడగొట్టిన బౌలర్గా నేపాల్ స్పిన్నర్ సందీప్ లమిచానె రికార్డు నెలకొల్పాడు. ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) ప్రీమియర్ కప్ టోర్నీలో భాగంగా ఒమన్తో శుక్రవారం జరిగిన మ్యాచ్లో సందీప్ మూడు వికెట్లు తీశాడు. తద్వారా 42 మ్యాచ్ల్లోనే 100 వికెట్ల మైలురాయిని అందుకున్న తొలి బౌలర్గా సందీప్ నిలిచాడు. ఇప్పటి వరకు ఈ రికార్డు అఫ్గానిస్తాన్ స్పిన్నర్ రషీద్ ఖాన్ (44 మ్యాచ్లు) పేరిట ఉండేది.

సెమీస్లో బోపన్న జోడీ



బార్సిలోనా: బార్సిలోనా ఓపెన్ ఏటీపీ-500 టెన్నిస్ టోర్నీలో రోహన్ బోపన్న (భారత్)-మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో బోపన్న-ఎబ్డెన్ ద్వయం 6-2, 6-4తో సాంటియాగో గొంజాలెజ్ (మెక్సికో)-ఎడ్వర్డ్ రోజర్ వాసెలిన్ (ఫ్రాన్స్) జంటను ఓడించింది. 64 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్లో బోపన్న, ఎబ్డెన్ రెండు ఏస్లు సంధించి, రెండు డబుల్ ఫాల్ట్లు చేశారు. తమ సర్వీస్ను ఒకసారి కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్ను నాలుగుసార్లు బ్రేక్ చేశారు.

చెన్నై చమక్...

బాధ్యత లేని బ్యాటింగ్, పసలేని బౌలింగ్తో సన్రైజర్స్ హైదరాబాద్ భంగపడింది. పటిష్టమైన బౌలింగ్, కట్టుదిట్టమైన ఫీల్డింగ్తో ప్రత్యర్థిని కట్టడి చేసిన చెన్నై సూపర్ కింగ్స్ ... సులభమైన లక్ష్యాన్ని ఎలాంటి ఇబ్బంది లేకుండా ఛేదించింది. జడేజా స్పిన్ మ్యాజిక్, కాన్వే విలువైన ఫిఫ్టీతో చెన్నై ఈ సీజన్లో నాలుగో విజయాన్ని నమోదు చేసింది.

- సన్రైజర్స్పై ఏడు వికెట్లతో విజయం
- తిప్పేసిన జడేజా
- మెరిపించిన కాన్వే


కాన్వే


జడేజా

చెన్నై: ఐపీఎల్లో చెన్నై దూకుడు పెరుగుతోంది. హైదరాబాద్ను బౌలింగ్, ఫీల్డింగ్, బ్యాటింగ్ ఇలా అన్నిరంగాల్లో కట్టడి చేసిన సూపర్కింగ్స్ 7 వికెట్లతో జయభేరి మోగించింది. మొదట సన్రైజర్స్ 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 134 పరుగులు చేసింది. అభిషేక్ శర్మ (26 బంతుల్లో 34; 3 ఫోర్లు, 1 సిక్స్) మెరుగ్గా ఆడాడు. చెన్నై బౌలర్లలో 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' రవీంద్ర జడేజా 3 వికెట్లు తీశాడు. అనంతరం సూపర్ కింగ్స్ 18.4 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 138 పరుగులు చేసి గెలిచింది. కాన్వే (57 బంతుల్లో 77 నాటౌట్; 12 ఫోర్లు, 1 సిక్స్) అజేయంగా నిలిచాడు. మార్కండేకు 2 వికెట్లు దక్కాయి.

జడేజా మాయ...

హైదరాబాద్ ఇన్నింగ్స్ను ఎక్కడికక్కడ చెన్నై బౌలర్లు కట్టడి చేశారు. పవర్ ప్లేలో ఓపెనర్ హ్యారీ బ్రూక్ (13 బంతుల్లో 18; 3 ఫోర్లు) బౌండరీలతో వేగం పెంచినా... అంతలోనే ఆకాశ్ సింగ్ క్లీన్ వేశాడు. తర్వాత హిట్టర్ రాహుల్ త్రిపాఠి (21 బంతుల్లో 21; 1 ఫోర్, 1 సిక్స్) ఆడినా, కెప్టెన్ మార్క్రమ్ (12 బంతుల్లో 12; 1 ఫోర్) బ్యాటింగ్కు దిగినా... క్లాసెన్ (16 బంతుల్లో 17; 1 ఫోర్) క్రీజులోకి వచ్చినా... నిలిచింది కాసేపే! ధాటైన ఇన్నింగ్స్, చితగ్గొట్టే ఓవర్ ఒక్కటైన కనిపించలేదు. ఉన్నంతలో అభిషేక్ శర్మ చేసిన స్కోరే కాస్త మెరుగనిపించింది. అనుభవజ్ఞుడైన స్పిన్నర్ జడేజా కీలకమైన అభిషేక్, రాహుల్ త్రిపాఠి, మయాంక్ అగర్వాల్ (2) వికెట్లతో సన్రైజర్స్ స్కోరు ఏమాత్రం పెరగకుండా అడ్డుకున్నాడు.

కాన్వే ధనాధన్...

చెన్నై ముందున్న సులువైన లక్ష్యాన్ని రుతురాజ్ గైక్వాడ్ (30 బంతుల్లో 35; 2 ఫోర్లు) బౌండరీతో మొదలుపెట్టాడు. డెవాన్ కాన్వే ధనాధన్ ఆటతో పరుగులు వేగంగా వచ్చాయి. మార్కో జాన్సెన్ వేసిన ఆరో ఓవర్ను కాన్వే అదేపనిగా దంచేశాడు. ఎదుర్కొన్న 5 బంతుల్ని 4, 4, 6, 4, 4లుగా బౌండరీలకు తరలించడంతో 23 పరుగులొచ్చాయి. దీంతో పవర్ప్లేలో చెన్నై స్కోరు 60/0. టార్గెట్లో అటుఇటుగా సగం పనైపోయింది. 11వ ఓవర్లో రుతురాజ్ రనౌట్ కావడంతో 87 పరుగుల ఓపెనింగ్ భాగస్వామ్యానికి తెరపడింది. తర్వాత వచ్చిన అజింక్య రహానే (10 బంతుల్లో 9; 1 ఫోర్), ఇంపాక్ట్ ప్లేయర్ అంబటి రాయుడు (9 బంతుల్లో 9; 1 ఫోర్) విఫలమైనా కాన్వే అజేయంగా నిలబడి జట్టును గెలిపించాడు.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.
రాజస్తాన్	6	4	2	8	1.043
లక్నో	6	4	2	8	0.709
చెన్నై	6	4	2	8	0.355
గుజరాత్	5	3	2	6	0.192
బెంగళూరు	6	3	3	6	-0.068
ముంబై	5	3	2	6	-0.164
పంజాబ్	6	3	3	6	-0.298
కోల్కతా	6	2	4	4	0.214
హైదరాబాద్	6	2	4	4	-0.794
ఢిల్లీ	6	1	5	2	-1.183

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.-నెట్ రన్రేట్

ఐపీఎల్లో నేడు

గుజరాత్ x లక్నో (మ. గం. 3:30 నుంచి)
ముంబై x పంజాబ్ (రాత్రి గం. 7:30 నుంచి)
స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

స్కోరు వివరాలు

సన్రైజర్స్ హైదరాబాద్ ఇన్నింగ్స్: బ్రూక్ (సి) రుతురాజ్ (బి) ఆకాశ్ 18; అభిషేక్ శర్మ (సి) రహానే (బి) జడేజా 34; రాహుల్ త్రిపాఠి (సి) ఆకాశ్ (బి) జడేజా 21; మార్క్రమ్ (సి) ధోని (బి) తీక్షణ 12; క్లాసెన్ (సి) రుతురాజ్ (బి) పతిరణ 17; మయాంక్ (స్టంప్డ్) ధోని (బి) జడేజా 2; జాన్సెన్ (నాటౌట్) 17; సుందర్ (రనౌట్) 9; ఎక్స్ట్రాలు 4; **మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 134.** **వికెట్ల పతనం:** 1-35, 2-71, 3-84, 4-90, 5-95, 6-116, 7-134. **బౌలింగ్:** ఆకాశ్ 3-0-17-1, తుషార్ దేశ్పాండే 3-0-26-0, తీక్షణ 4-0-27-1, మొయిన్ అలీ 2-0-18-0, జడేజా 4-0-22-3, పతిరణ 4-0-22-1.

చెన్నై సూపర్ కింగ్స్ ఇన్నింగ్స్: రుతురాజ్ (రనౌట్) 35; కాన్వే (నాటౌట్) 77; రహానే (సి) మార్క్రమ్ (బి) మార్కండే 9; రాయుడు (బి) మార్కండే 9; అలీ (నాటౌట్) 6; ఎక్స్ట్రాలు 2; **మొత్తం (18.4 ఓవర్లలో 3 వికెట్లకు) 138.** **వికెట్ల పతనం:** 1-87, 2-110, 3-122. **బౌలింగ్:** భువనేశ్వర్ 2-0-10-0, జాన్సెన్ 3-0-37-0, మార్క్రమ్ 1-0-11-0, సుందర్ 2.4-0-16-0, మార్కండే 4-0-23-2, ఉమ్రాన్ 3-0-18-0, డాగర్ 3-0-21-0.

సచిన్, కోహ్లి, రోహిత్ల 'బ్లూ టిక్' మార్క్ తొలగింపు

- ఈ జాబితాలో ధోని, సింధు, సైనా, సానియా, నిఖత్ జరీన్ తదితరులు
- డబ్బులు చెల్లిస్తేనే 'బ్లూ టిక్' సౌకర్యం కల్పిస్తున్న ట్విట్టర్



న్యూఢిల్లీ: ప్రముఖ సోషల్ నెట్వర్క్ సైట్ 'ట్విట్టర్' సెలబ్రిటీలకు మింగుడు పడని నిర్ణయం తీసుకుంది. క్రికెట్ దిగ్గజాలు సచిన్ టెండూల్కర్, విరాట్ కోహ్లి, బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు తదితర తారల ట్విట్టర్ ఖాతాలకు 'బ్లూ టిక్' మార్క్లను తొలగించింది. ఈ మార్క్లు అధికారిక ఖాతా (వెరిఫైడ్ ఐడెంటిటీ) అనే ముద్ర కలిగి ఉంటాయి. ఇన్నాళ్లు సెలబ్రిటీలు, జర్నలిస్టులు, ఉన్నతస్థాయి ప్రభుత్వ ఉద్యోగులకు ఉచితంగా 'బ్లూ టిక్' మార్క్లను కల్పించింది. అయితే ఈ మైక్రో బ్లాగ్ సైట్ను టెస్లా సీఈఓ ఎలాన్ మస్క్ కొనుగోలు చేశాక నిబంధనలు మార్చారు. ఇందులో భాగంగా ఇకపై (ఏప్రిల్ 20 నుంచి) చెల్లింపు ఖాతాలకే 'బ్లూ టిక్' మార్క్లు కేటాయించాలని ట్విటర్ నిర్ణయించడంతో క్రీడా దిగ్గజాలు, సినీ తారలు 'బ్లూ టిక్'ను కోల్పోయారు. సచిన్, కోహ్లిలే కాదు... ధోని, రోహిత్ శర్మ, సైనా నెహ్వాల్, నీరజ్ చోప్రా, బజరంగ్ పూనియా, వినేశ్ ఫొగాట్, బాక్సర్ నిఖత్ జరీన్, సానియా మీర్జా, సునీల్ ఛెత్రి, పీఆర్ శ్రీజేశ్, అంతర్జాతీయ దిగ్గజాలు ఫెడరర్, రాఫెల్ నాదల్ (టెన్నిస్), క్రిస్టియానో రొనాల్డో, ఎంబాపె (ఫుట్బాల్), ఖాతాలకు కూడా 'బ్లూ మార్క్'లు కనిపించవు.

ఏమిటీ 'బ్లూ టిక్'?



సచిన్ లేదంటే ఇంకే హీరో పేరు మీద ఇతరులు కూడా నకిలీ ఖాతాలు తెరుస్తారు. కానీ అసలైన సచిన్ టెండూల్కర్ ట్విట్టర్ ఖాతా ఏదంటే మాత్రం 'బ్లూ టిక్'తో వెరిఫైడ్ ఐడెంటిటీ తేలిపోతుంది. ఇప్పుడీ అధికారిక ముద్ర కోసం డబ్బులు చెల్లించాల్సి వస్తోంది. వెరిఫైడ్ ఐడెంటిటీ కావాలంటే వెబ్ పోర్టల్కు రూ. 650, మొబైల్ ఫోన్లకు రూ. 900 ప్రతి నెలా చెల్లించాలి. 'బ్లూటిక్' మార్క్ తొలగించడంతో సచిన్ తన అధికారిక ఖాతాలో జాతీయ పతాకాన్ని పెట్టుకొని ఇదే నా 'బ్లూ టిక్ వెరిఫికేషన్' అని కామెంట్ జత చేశాడు.